

సత్ఫలితాలిస్తున్న విద్యా రంగ సంస్కరణలు

- నక్కపల్లి మండల విద్యాశాఖాధికారులకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు
- దేవవరం మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఒకేరోజు 32 మంది ప్రైవేటు పాఠశాలల పిల్లలు చేరిక
- ట్విట్టర్‌లో ఆంధ్రజ్యోతి కథనం పోస్టు చేసిన మంత్రి నారా లోకేశ్

- 6లో

ఫేసియల్ పరేషాన్!



యాప్‌లో లబ్ధిదారు ముఖ గుర్తింపు నమోదు చేస్తున్న దృశ్యం

- జిల్లాలో 1,908 అంగన్‌వాడీ కేంద్రాలు
- గర్భిణులు, బాలింతలు, మూడేళ్లలోపు పిల్లలు కలిపి 53,022 మంది
- సాంకేతిక సమస్యతో నమోదుకానివారు 2,625 మంది

నర్సీపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రేషన్ సరుకులు తీసుకునే గర్భిణులు, బాలింతలు, 7 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలకు ముఖ గుర్తింపు హాజరును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు బాల సంజీవిని కిట్టు, 3 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలకు టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్) పంపిణీ చేస్తారు. బాల సంజీవిని, టీహెచ్‌ఆర్ తీసుకునే లబ్ధిదారులకు ముఖ గుర్తింపు హాజరు తప్పనిసరి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాల సంజీవిని యాప్, కేంద్ర ప్రభుత్వం పోషణ ట్రాకర్ యాప్‌లు సెల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని అంగన్‌వాడీ కేంద్రాలలో ఆయా యాప్‌ల ద్వారా ఫేసియల్ రికగ్నైజేషన్ సిస్టం(ఎఫ్‌ఆర్‌ఎస్)లో ముఖ గుర్తింపు నమోదు చేసుకోవాలి. గత ఏడు నెలలుగా ముఖ గుర్తింపు నమోదు కాకపోయినా లబ్ధిదారులకు మాన్యువల్‌గా రేషన్ సరుకులు ఇచ్చేవారు. అయితే ఈ నెలలో ముఖ గుర్తింపు నమోదుకాని లబ్ధిదారులకు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రేషన్ సరుకుల పంపిణీ నిలిచిపోనున్నది.

జిల్లాలో తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1908 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. బాలింతలు, గర్భిణులు, 7 నెలల నుంచి 3 సంవత్సరాలలోపు పిల్లలు మొత్తం 53,022 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 50,397 మందికి ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్‌ఆర్‌ఎస్)లో నమోదు పూర్తి చేశారు. ఇంకా 2,625 మంది మిగిలిపోయారు. ఇప్పటి వరకు ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమోదుకాని లబ్ధిదారులకు కూడా అంగన్‌వాడీ కేంద్రాలలో మాన్యువల్‌గా రేషన్ సరుకులు ఇచ్చేవారు. అయితే వచ్చే నెల నుంచి మాత్రం వీరిని అనర్హులుగా తేల్చి సరుకుల సరఫరా నిలిపివేయనున్నారు.

- వీరందరికీ వచ్చే నెలలో రేషన్ సరుకులు నిలిపివేసే అవకాశం

సర్వర్లు పని చేయక చిక్కులు

పోషణ ట్రాకర్ యాప్‌లో లబ్ధిదారుల ఫొటో తీసేటప్పుడు ఆధార్‌లో ఫొటో మ్యాచ్ కాకపోతే తిరస్కరిస్తుంది.

దీనికి తోడు సర్వర్ సమస్య కారణంగా లబ్ధిదారులు వచ్చినప్పుడు యాప్‌లు పని చేయడం లేదు. ఉదయం 10 గంటలలోపు సర్వర్లు పని చేస్తున్నాయి. తరువాత ఎంత ప్రయత్నం చేసినా పని చేయడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు అంటున్నారు.

మూడు సార్లు తిరిగినా..

మూడు సార్లు తిరిగినా ముఖ గుర్తింపు నమోదు కాలేదు. నాట్ మ్యాచ్ అని వస్తుంది. ఇప్పటి వరకు మాన్యువల్‌గా సరుకులు ఇస్తున్నారు. వచ్చే నెల నుంచి ముఖ గుర్తింపు నమోదుకాని వారికి రేషన్ సరుకుల సరఫరా నిలిపివేస్తామని చెబుతున్నారు.

- అడారి రమ్య వెంకటలక్ష్మి, బాలింత, కొత్తవీధి అంగన్‌వాడీ కేంద్రం-2

ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమోదుకాని లబ్ధిదారులు

- నర్సీపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 4,430 మంది లబ్ధిదారులు ఉండగా, 4,366 మంది ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమోదయ్యారు. ఇంకా 64 మంది నమోదు కావలసి ఉంది.
- అనకాపల్లి ప్రాజెక్టు పరిధిలో 7,992 లబ్ధిదారులకు గాను 7,828 మందికి ముఖ గుర్తింపు పూర్తయింది. ఇంకా 164 మంది మిగిలిపోయారు.
- గొలుగొండ ప్రాజెక్టు పరిధిలో 3,645 మందికి గాను 3,579 మంది ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమోదయ్యారు. ఇంకా 66 మంది మిగిలిపోయారు.
- కె.కోటపాడు ప్రాజెక్టు పరిధిలో 2,802 మంది లబ్ధిదారులకు గాను 2,751 మంది ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమోదయ్యారు. ఇంకా 51 మంది మిగిలిపోయారు.
- నక్కపల్లి ప్రాజెక్టు పరిధిలో 9,284 మంది లబ్ధిదారులకు గాను 8,437 మంది నమోదయ్యారు. ఇంకా 847 మంది మిగిలిపోయారు.
- రావికమతం ప్రాజెక్టు పరిధిలో 7,919 మంది లబ్ధిదారులకు గాను 7,709 మంది నమోదయ్యారు. ఇంకా 210 మంది మిగిలిపోయారు.
- సబ్బవరం ప్రాజెక్టు ... మిగతా 6వ పేజీలో

దడ పుట్టించే దారులు

గోతులమయంగా అసకపల్లి- లంకెలపాలెం రహదారి

- గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- రేఖవానిపాలెం - నునపర్తి రహదారి పరిస్థితి కూడా అంతే..
- ఇటుగా రాకపోకలు సాగించాలంటే వాహనచోదకులు బెంబేలు



ఎరుకునాయుడుపాలెం- పైడివాడఅగ్రహారం మధ్య అధ్వానంగా రహదారి

సబ్బవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలోని పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వర్షమొస్తే పరిస్థితి దారుణంగా ఉంటోంది. గోతుల్లో వర్షపు నీరు వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా సబ్బవరం మండలంలోని అసకపల్లి- లంకెలపాలెం రోడ్డు గోతులమయంగా ఉంది. అలాగే పరవాడ మండలంలోని రావాడ పంచాయతీ పరిధి బొట్టవానిపాలెం జంక్షన్ నుంచి రేఖవానిపాలెం మీదుగా నునపర్తికు వెళ్లే ప్రధాన రహదారి ఘోరంగా తయారైంది. దీంతో ఈ మార్గాలో ప్రయాణించాలంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు.**

సబ్బవరం మండలంలోని అసకపల్లి- లంకెలపాలెం రోడ్డు అత్యంత దారుణంగా మారింది. ఇటుగా ప్రయాణం అంటేనే వాహనచోదకులు ... మిగతా 6వ పేజీలో



అసకపల్లి- లంకెలపాలెం రోడ్డులో అసకపల్లి వద్ద ఏర్పడిన గోతులు

ఘోరంగా రేఖవానిపాలెం- నునపర్తి రోడ్డు

పరవాడ: పరవాడ మండలంలోని రావాడ పంచాయతీ పరిధి బొట్టవానిపాలెం జంక్షన్ నుంచి రేఖవానిపాలెం మీదుగా నునపర్తికు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గొల్లగరువు సమీపంలో రహదారి పూర్తిగా బురదమయమైంది. దీని వల్ల ఇటుగా రాకపోకలు సాగించే వారంతా అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు సైతం బురద కారణంగా అదుపు తప్పి బోల్తా పడుతున్నాయి. లారీలు, ఇతర వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. రాత్రి వేళల్లో ప్రయాణం కష్టంగా ఉందని వాహనచోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రహదారి బురదమయంగా ఉండడంతో కూరుకుపోయిన లారీ

ప్రాణం తీసిన ఈత సరదా

- గెడ్డలో మునిగి ఒకరి మృతి
- మరొకరి పరిస్థితి విషమం



ఖ్యాతితేజ మృతదేహం

మాడుగుల రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా ఒక వ్యక్తి ప్రాణాలు బలిగొంది. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మాడుగుల మండలం శివారు ఏజెన్సీ ముఖ ద్వారం గరికబంద సమీపాన బిల్లలపాలెం వద్ద తాచేరు గెడ్డలో ఆదివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన రంభ ఖ్యాతి తేజ, ఆర్.కె.కౌశిల్, లెక్కల కుమారస్వామి, పైల బాలకృష్ణ, తాటికొండ సురేశ్‌లు స్నేహితులు. వీరిలో కుమారస్వామిది మాడుగుల స్వగ్రామం. ప్రస్తుతం విశాఖపట్నంలో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా ఈ ఐదుగురు స్నేహితులు మాడుగులలో ఓ శుభకార్యానికి ఆదివారం కారులో వచ్చారు. మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత అక్కడ నుంచి బయల్దేరి పాడేరు, అరకు మీదుగా విశాఖపట్నానికి వెళదామని నిర్ణయించుకున్నారు. మాడుగుల నుంచి కారులో బయల్దేరి పాడేరు వెళుతుండగా ఏజెన్సీ ముఖద్వారం గరికబంద నుంచి పక్కగా లోపలికి సుమారు కిలోమీటరు దూరంలోని బిల్లలపాలెం వద్ద గల తాచేరు గెడ్డలో సరదాగా ఈత కొడదామని అక్కడికి వెళ్లారు. తాటికొండ సురేశ్ మినహా మిగిలిన నలుగురు(ఖ్యాతితేజ, కౌశల్, కుమారస్వామి, బాలకృష్ణ) తాచేరు గెడ్డలోకి దిగారు. కుమారస్వామి, బాలకృష్ణ ఒక దగ్గర, వీరికి కొంచెం దూరంలో కౌశల్, మరికొంత దూరంలో ఖ్యాతితేజ స్నానాలు చేస్తున్నారు. అయితే లోతు ఎక్కువగా, ఊబి ఉన్న ప్రాంతంలో ఖ్యాతితేజ మునిగిపోయాడు. కౌశల్ కూడా మునిగిపోతుండడాన్ని గమనించి కుమారస్వామి, బాలకృష్ణ రక్షించి ఒడ్డుకు లాక్కుని వచ్చారు. ఖ్యాతితేజను కూడా అతికష్టమ్మీద ... మిగతా 6వ పేజీలో

ఆయిల్‌పామ్ సాగు భళా

జిల్లాలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం

- తక్కువ పెట్టుబడితో అధిక లాభం
- ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతుల ఆసక్తి



కోటవురట్ల మండలం లింగాపురంలో ఆయిల్‌పామ్ సాగు



కోటవురట్ల మండలం రాజుపేటలోని నర్సరీలో మొక్కల పెంపకం

కోటవురట్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రభుత్వం ఈ పంట సాగుకు మొక్కలతో పాటు సబ్సిడీని కూడా ఇస్తుండడంతో దీని పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. పంట చేతికి వచ్చే సమయానికి ఫ్యాక్టరీలు అందుబాటులో ఉండడం, విదేశాలకు కూడా ఎగుమతి అయ్యే అవకాశం ఉండడంతో ఎక్కువ మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు.**

జిల్లాలోని అన్ని మండలాల్లో ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానవన శాఖాధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో సుమారు ఐదు వేల హెక్టార్లలో 2,100 మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. కోటవురట్ల మండలం రాజుపేటలో పతాంజలి సంస్థ ప్లాంటేషన్ ఏర్పాటు చేసింది. దీని ద్వారా రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్నారు. రైతులు ఎకరాకు 53 నుంచి 57 మొక్కల వరకు నాటుతున్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేలు సబ్సిడీ ఇస్తుండగా, దీనిలో రూ.20 వేలు వరకు డ్రిప్ కోసం వినియోగిస్తున్నారు. మిగతా నగదును నాలుగేళ్ల పాటు సాగు కోసం వెచ్చించనున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 1,200 ఎకరాలకు అనుమతులు మంజూరుకాగా, 530 ఎకరాల్లో సాగు చేశారు.



ఆయిల్‌పామ్ గెలలు

తక్కువ పెట్టుబడితో..

ఆయిల్‌పామ్ ఐదు సంవత్సరాల నుంచి కాపు ప్రారంభమవుతుందని రైతులు చెబుతున్నారు. ఇరవై ఏళ్ల పాటు కాపు వస్తుందని, కూలీల అవసరం కూడా తక్కువేనని అంటున్నారు. పంట చేతికొచ్చే సమయంలో కోసిన వెంటనే 24 గంటల్లో ఫ్యాక్టరీకి తరలించాలి. పెట్టుబడి తక్కువ, లాభం ఎక్కువ ఉండడంతో రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.



విశాఖ కలెక్టరేట్‌లో సచివాలయ ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

సచివాలయ ఉద్యోగులకు బదిలీలు

- 336 మంది సర్వేయర్లు, 443 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బదిలీ

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ఆదివారం సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణలో విశాఖ, అనకాపల్లి సర్వేశాఖ ఏడీలు సూర్యారావు,గోపాలరాజా ఆధ్వర్యంలో 336 మంది సర్వేయర్లకు బదిలీ చేశారు. మూడు జిల్లాల పరిధిలో బదిలీల ప్రక్రియ చేపట్టడంతో సచివాలయం ఎంపికకు ప్రతి ఉద్యోగికి ఐదు నుంచి పదిమిషాలు పడుతోంది. దీంతో రాత్రి వరకు కౌన్సెలింగ్ కొనసాగించారు.

జిల్లా పరిషత్ సమావేశమందిరంలో 443 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ జరిగింది. ఈ ప్రక్రియ ఉదయమే నిర్వహిస్తామని ప్రకటించడంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వచ్చారు. మెరిట్ జాబితా ప్రకటించడానికి ఆలస్యమైంది. దీంతో సాయంత్రం కౌన్సెలింగ్ ప్రారంభించారు. బదిలీల్లో కూటమి ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పలువురికి సిఫారసు లేఖలు ఇచ్చారు. కొందరు ఎమ్మెల్యేలు ఫోన్‌లు చేసి ఒత్తిడి తెచ్చారు. దీంతో బదిలీలపై కొందరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అనుమానం వ్యక్తంచేశారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



కూర్మావతారంలో జగన్నాథ స్వామి

స్థానిక శ్రీకేశవస్వామి ఆలయంలో జగన్నాథుని దశ రూప మహోత్సవాల్లో భాగంగా ఆదివారం జగన్నాథస్వామి కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కూర్మావతారంలో ఉన్న జగన్నాథుడిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

- చోడవరం/ఆంధ్రజ్యోతి


ఏయూలో క్వాంటమ్ కంప్యూటింగ్

ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రవేశాలు

- సన్నాహాలు చేస్తున్న అధికారులు
- ఈఏపీసెట్ ర్యాంకర్లకు అవకాశం

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): **ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మరో కొత్త కోర్సును ప్రారంభించేందుకు చురుగ్గా సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సాంకేతికత అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణమైన కోర్సులను ప్రవేశపెట్టేందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) యత్నిస్తోంది. అందులో భాగంగానే అతికొద్ది విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ జాబితాలో ఏయూ చోటు దక్కించుకుంది.**

- దక్షిణ భారతదేశంలో తొలి వర్సిటీగా గుర్తింపు



దక్షిణ భారతదేశంలో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు నిర్వహించనున్న తొలి వర్సిటీగా ఏయూ గుర్తింపు దక్కించుకుంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ కోర్సును 60 సీట్లతో ... మిగతా 6వ పేజీలో

భక్తులకు తప్పిన ప్రమాదం

ఆటో డ్రైవర్ సమయస్ఫూర్తితో తప్పిన ముప్పు

నక్కపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై నక్కపల్లి వారపుసంత వద్ద ఆదివారం సాయంత్రం ఒక కుటుంబం ప్రమాదం నుంచి బయటపడింది. అనకాపల్లికి చెందిన ఒక కుటుంబానికి చెందిన వారు ఆదివారం ఉదయం ఆటోలో తలుపులమ్మ లోవ ఆలయానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నక్కపల్లి వారపు సంత వద్ద ఒక కారు వీరు ప్రయాణిస్తున్న ఆటోపైకి వచ్చింది. ఆటో డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి, ఆగి వున్న లారీని ఢీకొట్టాడని స్థానికులు చెప్పారు. ఆటోలో వున్న ప్రయాణికులెవరికీ ఏమీ కాకపోవడంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు.

ఫేసియల్ పరేషాన్!

... 5వ పేజీ తరువాయి

పరిధిలో 5,273 మంది లబ్ధిదారులకు గాను 5,101 మందికి ఎఫ్ఆర్ఎస్‌లో నమోదయ్యారు. ఇంకా 172 మంది నమోదు కావలసి ఉంది.

- వి.మాడుగుల ప్రాజెక్టు పరిధిలో 3,240 మంది లబ్ధిదారులకు గాను 2,971 మందికి పూర్తి చేశారు. ఇంకా 269 మంది మిగిలిపోయారు.
- ఎలమంచిలి ప్రాజెక్టు పరిధిలో 8,437 మంది లబ్ధిదారులకు గాను 7,655 మంది ఎఫ్ఆర్ఎస్‌లో నమోదయ్యారు. ఇంకా 782 మంది మిగిలిపోయారు.

దడ పుట్టించే దారులు

... 5వ పేజీ తరువాయి

హడలిపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత దుర్భరంగా తయారైంది. ముఖ్యంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించేవారి అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రోడ్డు వంక కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. దీనికి తోడు అప్పట్లో అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఫిల్లింగ్ పనుల కోసం పరవాడ ఎన్టీపీసీ బూడిదను తరలించేవారు. దీంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని అంటున్నారు. అయినప్పటికీ కనీస మరమ్మతులు చేపట్టలేదు. ఫలితంగా ఎక్కడికక్కడ రెండు అడుగుల నుంచి మూడు అడుగుల లోతులో గుంతలు ఏర్పడ్డాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ కృషితో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఎన్టీపీసీ నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్ఆర్) నిధులు రూ.70 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో లంకెలపాలెం నుంచి పెద ముషిడివాడ, పైడివాడఅగ్రహారం సమీపం వరకూ మరమ్మతు పనులు పూర్తి చేయించారు. పైడివాడ అగ్రహారం నుంచి అనకపల్లి వరకూ మరమ్మతు పనులకు అనుకూలంగా ఉన్నచోట్ల పనులు పూర్తిచేశారు. అయితే కొన్నిచోట్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమై పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో మరమ్మతులు చేయడానికి వీలు పడలేదని అధికారులు చెబుతున్నారు. పూర్తి స్థాయిలో మరమ్మతు పనులు చేసేందుకు నిధులు చాలకపోవడంతో తాత్కాలికంగా పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరింత దారుణంగా తయారైంది. కాగా ఈ మార్గంలో ఇప్పటికీ భారీ డంపర్లు పరిమితికి మించి లోడుతో రాకపోకలు సాగిస్తుండడం వల్ల రోడ్డు పాడవుతోందని స్థానికులు అంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా వాహన చోదకులు కోరుతున్నారు. అనకపల్లి నుంచి పైడివాడ అగ్రహారం వరకు నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డును బాగు చేసేందుకు ప్రభుత్వం రూ.2.5 కోట్లు మంజూరు చేసిందని ఆర్అండ్‌బీ శాఖ జేఈ బాలరాజు తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. గతంలో ఈ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టేందుకు అవకాశం లేనంతగా పాడై పోయిందని చెప్పారు.

ప్రాణం తీసిన ఈత సరదా

... 5వ పేజీ తరువాయి

ఒడ్డుకు చేర్చారు. అయితే అప్పటికే ఖ్యాతితేజ నీరు ఎక్కువగా తాగేయడంతో స్పృహ కోల్పోయి అపస్మారక స్థితిలో ఉన్నాడు. చుట్టుపక్కల వారి సాయంతో ఖ్యాతి తేజ, కౌశల్‌లను స్నేహితులు మాడుగుల ప్రభుత్వాస్పత్రికి తీసుకు వచ్చారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఖ్యాతితేజ(33) మృతి చెందినట్టు నిర్ధారించారు. కౌశల్‌కి ప్రథమ చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండడంతో 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడు ఖ్యాతితేజ విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్టు సమాచారం. కౌశల్ విశాఖపట్నంలో సీలింగ్ వర్క్ చేస్తుంటాడు. ఇతనికి కూడా వివాహమైంది. ప్రమాద విషయం తెలుసుకున్న మాడుగుల ఎస్ఐ నారాయణరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించామని, మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇచ్చిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ఏయూలో క్వాంటమ్ కంప్యూటింగ్

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించేందుకు వర్సిటీకి అవకాశం దక్కింది. తొలి ఏడాది 30 సీట్లలో ప్రవేశాలు కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈఏపీసెట్ ర్యాంకర్లకు మాత్రమే ప్రవేశాలు కల్పించనున్నారు. కోర్సులో చేరే విద్యార్థులకు రూ.79 వేలు ఫీజుగా నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించే విద్యార్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం ఉండదని చెబుతున్నారు. కంప్యూటర్ సైన్స్, ఈసీఈ వంటి బ్రాంచ్‌ల మాదిరిగా ప్రత్యేక బ్రాంచ్‌గా ఈ కోర్సును నిర్వహించనున్నారు.

అత్యాధునిక ల్యాబ్‌లు అవసరం

క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు నిర్వహణకు అత్యాధునిక ల్యాబ్‌లు అవసరం. ఇందుకోసం కొన్ని ప్రైవేటు సంస్థల ల్యాబ్ సేవలను వర్చువల్ విధానంలో వినియోగించుకోవాలని వర్సిటీ అధికారులు భావిస్తున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ ల్యాబ్‌లు అమెజాన్, మైండ్ ట్రీ, గూగుల్ వంటి సంస్థలకున్నాయి. వాటిని వర్చువల్ విధానంలో బోధనకు వినియోగించుకునేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చినట్టు చెబుతున్నారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సుగా నిర్వహణ..

క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును దేశంలోని కొన్ని విద్యా సంస్థలు ఇంటిగ్రేటెడ్ కోర్సుగా నిర్వహిస్తున్నాయి. ఈ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయంటున్నారు. భవిష్యత్తు టెక్నాలజీ, ఆవిష్కరణలు దీనిచుట్టే తిరుగుతున్న నేపథ్యంలో కోర్సు నిర్వహణ వర్సిటీకి జాతీయస్థాయిలో గుర్తింపును తీసుకువస్తుందని ఏయూ అధికారులు చెబుతున్నారు.

సత్ఫలితాలిస్తున్న విద్యా రంగ సంస్కరణలు

- నక్కపల్లి మండల విద్యాశాఖాధికారులకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు
- దేవవరం ప్రభుత్వ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఒకేరోజు 32 మంది ప్రైవేటు పాఠశాలల పిల్లలు చేరిక
- ట్విట్టర్‌లో 'ఆంధ్రజ్యోతి' కథనం పోస్టు చేసిన మంత్రి లోకేశ్

నక్కపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో గత ఏడాది కాలంగా విద్యావ్యవస్థలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయని, ఇందుకు నక్కపల్లి మండలం దేవవరం మోడల్ ప్రైమరీ స్కూల్ ఒక ఉదాహరణగా నిలుస్తుందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీన దేవవరం మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఒకే రోజు 32 మంది పిల్లలు పలు ప్రైవేట్ పాఠశాలల నుంచి ఈ బడిలో చేరారు. దీనిపై ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రభుత్వ పాఠశాలల వైపు..పిల్లల చూపు శీర్షికతో ప్రచురితమైన వార్తను మంత్రి లోకేశ్ చూశారు. ఈ కథనంపై ఆయన ట్విట్టర్, ఇతర సోషల్ మీడియాల్లో తన అభిప్రాయాన్ని పోస్ట్ చేశారు. ఒకే రోజు 32 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి దేవవరం మోడల్ ప్రాథమిక పాఠశాలలో చేరడం హర్షణీయమని లోకేశ్ పేర్కొన్నారు. ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ కోసం తాను చేస్తున్న కృషిలో భాగస్వామ్యంగా నిలుస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంత్రి అభినందనలు తెలియజేశారు. ఆంధ్రజ్యోతి కథనంపై మంత్రి నారా లోకేశ్ స్పందించిన అంశం నియోజకవర్గంలోనూ, జిల్లా విద్యాశాఖలోనూ వైరల్ అవుతోంది. సోమవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నక్కపల్లి మండలం విద్యాశాఖాధికారులను కూడా అభినందించనున్నారు.


@naralokesh

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యారంగంలో మార్పు మొదలైంది. విద్యావ్యవస్థలో సమూల ప్రక్షాళన కోసం ఏడాదికాలంగా నేను చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నందుకు ఆనందంగా ఉంది. నక్కపల్లి మండలం దేవవరంలో ఒకేరోజు 32మంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ మోడల్ ప్రైమరీ పాఠశాలకు మారడం హర్షణీయం. ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ కోసం నేను చేస్తున్న కృషిలో భాగస్వాములుగా నిలుస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మనస్ఫూర్తిగా అభినందనలు.

ప్రభుత్వ పాఠశాలల వైపు.. పిల్లల చూపు

ట్విట్టర్‌లో ఆంధ్రజ్యోతి కథనాన్ని పోస్ట్ చేసిన రాష్ట్ర ఐటీ, మానవవనరుల శాఖల మంత్రి లోకేశ్

భూములివ్వమంటే.. అధికారులు భయపెడుతున్నారు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రకు టీడీపీ నేతలతో కలిసి గొరపూడి పంచాయతీ రైతుల వినతి

రాంబిల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎస్ఈజడ్‌కు పంట భూములను ఇవ్వమని చెప్పినా వినిపించుకోకుండా అధికారులు, పాలకులు బలవంతంగా తీసుకోవడానికి భయపెడుతున్నారని మండలంలోని గొరపూడి పంచాయతీ రైతులు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం అమరావతి టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రకు టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర సెక్రటరీ రాజాన రమేశ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 2006లో ఎస్ఈజడ్‌కు గొరపూడి పంచాయతీ భూములకు నోటిఫికేషన్ ఇచ్చారని, అప్పటి నుంచి ఇప్పటివరకు భూములు ఇవ్వడానికి అంగీకరించలేదన్నారు. పలుమార్లు అధికారులు ఏర్పాటు చేసిన సమావేశాల్లో కూడా భూములివ్వమని స్పష్టం చేశామన్నారు. గత నెల రోజులుగా ఎస్ఈజడ్‌కు భూములు ఇవ్వాల్సిందేనని అధికారులు, పాలకులు ఇబ్బందులు పెడుతున్నారని, ప్రశ్నించే రైతులపై కేసులు పెడుతున్నారన్నారు. తమ జీవనాధారమైన భూములు ఇస్తే కుటుంబాలతో రోడ్డున పడతామని, తమను ఆదుకోవాలని రైతులు మంత్రి రవీంద్రను వేడుకున్నారు. దీనిపై స్పందించిన మంత్రి కొల్లు రవీంద్ర జిల్లా అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని టీడీపీ మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొరపూడి రైతులు లాలం రవి, టీడీపీ గొరపూడి గ్రామ అధ్యక్షుడు లెక్కల యశ్వంత్, రైతులు పాల్గొన్నారు.


ఇన్‌చార్జి మంత్రి రవీంద్రకు వినతిపత్రాన్ని అందజేసిన గొరపూడి రైతులు

ఎలమంచిలిలో ఎమ్మెల్యే సుందరపు సుడిగాలి పర్యటన

- ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ.. దుర్వాసన వస్తుండడంపై మండిపాటు
- యానాద్రి కాలువ నిర్మాణ పనులపై అసంతృప్తి

ఎలమంచిలి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదివారం ఉదయం పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక సీహెచ్‌సీని ఉదయం 7 గంటలకే ఎమ్మెల్యే తన అనుచరులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో శానిటేషన్ సక్రమంగా లేక దుర్వాసన వస్తుండడాన్ని గమనించి సిబ్బందిపై మండిపడ్డారు. శానిటేషన్ పనులు సక్రమంగా నిర్వహించాలని హెచ్చరించారు. వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి రోడ్డు గోతులు పడి బురదగా ఉండడంతో తాత్కాలికంగా క్రషర్ బుగ్గి వేయాలని కమిషనర్‌ను ఆదేశించడంతో వెనువెంటనే వెంటనే పనులకు ఉపక్రమించారు. అనంతరం చేపల మార్కెట్‌ను సందర్శించి వ్యాపారులతో మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని లేకుండా చేయాలని కమిషనర్‌కు సూచించారు. మార్కెట్ దుకాణాల వద్ద ఖాళీ మద్యం సీసాలు ఉండడాన్ని గమనించి డ్రోన్‌లు ఉపయోగించి నివారించాలని పట్టణ ఎస్ఐ సావిత్రికి వివరించారు. అనంతరం చైర్‌పర్సన్ రమాకుమారితో కలిసి యానాద్రి కాలువ పనులను పరిశీలించారు. కాలువ ఆనుకుని ఉన్న ఆక్రమణలను తొలగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మిలట్రీ కాలనీ, కొత్తపేట ప్రాంతాల్లో నిర్మించిన కాలువ పనులు పరిశీలించి, అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరాజు, జనసేన పార్టీ నేతలు పాల్గొన్నారు.


ఎలమంచిలి మిలట్రీకాలనీ వద్ద యానాద్రి కాలువ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్


ఎలమంచిలి ప్రభుత్వ సీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బందిని హెచ్చరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

టీడీపీ నేతలకు అందని ఆహ్వానం

అసంతృప్తి వ్యక్తం చేసిన శ్రేణులు

ఎలమంచిలి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపాలిటీలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు తమకు ఆహ్వానం అందడం లేదని టీడీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనసేన, బీజేపీ నేతలకు సమాచారం అందించడంతో పాటు అధికారికంగా ఆహ్వానాలు అందుతున్నాయని, కానీ తమకు మాత్రం సమాచారం ఉండడం లేదని ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందనే సంతృప్తే తప్ప మునిసిపాలిటీలో తమకు సరైన గుర్తింపు దక్కడం లేదని టీడీపీ నేతలు వాపోతున్నారు. శనివారం మునిసిపాలిటీలోని మెప్మా కార్యాలయంలో జరిగిన ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమంతో పాటు ఆదివారం పట్టణంలో జరిగిన ఎమ్మెల్యే విజయకుమార్ పర్యటన గురించి తమకు కనీసం సమాచారం కూడా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంపై పార్టీ అధిష్ఠానం తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రలోభాలకు లోనుకావద్దు

- టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు విజయ్

మునగపాక, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకపోవడం తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాల్లో ఒక అంశమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో మునగపాకలో భారీ బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. అధిష్ఠానం ఆదేశాలకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గవర కార్పొరేషన్ డైరెక్టర్ బీమరశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందన్నారు. మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలన అస్తవ్యస్తంగా మారిందని, దానిని సీఎం చంద్రబాబు సరిచేస్తున్నారన్నారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు కాండ్రేగుల శంకర్, ఉల్లింగల గోవింద, ఆడారి జానకి, సబ్బి శ్రీనివాసరావు, విల్లూరి నూకనర్సింగరావు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్‌కు ప్రజాదరణ

- బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సన్యాసినాయుడు


మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ శ్రేణులు

అచ్యుతాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న మనకీబాత్‌కార్యక్రమంలో దేశప్రజల మన్ననలు పొందిందని బీజేపీ ఎలమంచిలి నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు అన్నారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఎల్ఈడీ టీవీని ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని వీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో నిర్వహించిన యోగాంధ్ర గురించి ప్రధాన మంత్రి మోదీ ప్రస్తావించడం వల్ల విశాఖ పేరు ప్రపంచ నలుమూలల వ్యాపించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు కూండ్రపు నాయుడు బాబు, ఒరుపుల జయశంకర్, మామిడి సురేష్ కుమార్, మేరుగు కాసుబాబు, బండారు నాయుడు, పీలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఎస్. రాయవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీ పాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె రాజశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

టార్గెట్లతో తీవ్ర ఇక్కట్లు | గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగుల ఆవేదన

నక్కపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అరకొర వేతనాలతో నిరంతరం సేవలందిస్తున్న తమకు టార్గెట్లు పెట్టడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పోస్టల్ శాఖలో పనిచేస్తున్న గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ఉద్యోగులు ఆవేదన వెలిబుచ్చారు. ఎలమంచిలి డివిజన్ పరిధిలోని ఉద్యోగులంతా ఆదివారం ఉపమాకలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్‌బీఐ అకౌంట్లు, ఐపీపీబీ ఖాతాలు, ఇతర పాలసీలు, సుకన్య యోజన పథకం వంటి వాటిపై టార్గెట్లు విధించడంతో తాము తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని యూనియన్ డివిజన్ సెక్రటరీ డీఎస్ఆర్ ప్రసాద్ ఆవేదన వెలిబుచ్చారు. టార్గెట్ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ ప్రతినిధులు కె.మనోహర్, నరిశే దయానంద్ (దిలీప్), విశ్వేశ్వరరావు, బబీవీ రమణ, వీరభద్రం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


జీడీఎస్ ఉద్యోగుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన

రాంబిల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడివాడ పంచాయతీ నారాయణపురం గ్రామంలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఆదివారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ నిధులు రూ.5 లక్షలతో కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. గ్రామాల్లోని ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్న ఘనత ఒక్క కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. మండలాల వారీగా ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మామిడివాడ సర్పంచ్ మట్లా అప్పలనర్స, జనసేన పార్టీ నాయకులు సన్యాసిరావు, బాను, గ్రామస్థులు పాల్గొన్నారు..


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సుందరపు

మా భూముల జోలికి రావద్దు : డీఎల్‌పురం గ్రామస్థులు

నక్కపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఫేజ్-2లో భూములు ఇచ్చే ప్రసక్తే లేదని డీఎల్‌పురం గ్రామానికి చెందిన కొందరు నాయకులు, రైతులు స్పష్టం చేశారు. ఆదివారం గ్రామంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు గింజాల వెంకట రమణ, రైతు సంఘ నాయకులు వేగేశన సూరిబాబురాజు, అయినంపూడి తాతరాజు, గింజాల చిన తాతలు మాట్లాడారు. బల్క్ డ్రగ్, స్టీల్‌ప్లాంట్ కోసం అదనపు భూములు కావాలని ఒత్తిడి తెస్తే ఊరుకోబోమని, భూములు ఇవ్వమన్నారు. భూముల రక్షణ కోసం ఐక్యంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు.


ఆందోళన చేస్తున్న డీఎల్ పురం గ్రామస్థులు

టీడీపీ సమావేశానికి ప్రగడ హాజరు

అచ్యుతాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి నియోజకవర్గ నాయకులు హాజరయ్యారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన ప్రగడ నాగేశ్వరరావు

రోడ్డు నిర్వాసితులకు పరిహారాలన్నీ ఒకేసారి ఇవ్వాలి

అచ్యుతాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ నిర్వాసితులకు ఇళ్లు, దుకాణాలు, భూములకు ఒకేసారి నగదు రూపంలో పరిహారం చెల్లించాలని నిర్వాసితులు సంఘం కన్వీనర్ రొంగలి రాము డిమాండ్ చేశారు. ఆదివారం అచ్యుతాపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహాలు, షాపులకు అతి తక్కువ ధర నిర్ణయించారని ఆరోపించారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం పరిసర ప్రాంతాల్లో భూములకు విపరీతంగా ధరలు పెరిగాయని, సెంటు భూమి కూడా కొనలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణలో గృహాలు, షాపులు కోల్పోయిన వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అందువల్ల వీరికి మార్కెట్ ధరలకు అనుగుణంగా పరిహారం నగదు రూపంలో చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కర్రి అప్పారావు, రామ సదాశివరావు, ఎస్. కన్నుం నాయుడు, బుద్ధ రంగారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాము

గూడుపమ్మ ఆలయానికి ఆషాఢ శోభ

నక్కపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం భక్తుల తాకిడితో రేబాక గూడుపమ్మ అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. వారాహి దీక్షలు చేపట్టే వారితో పాటు ఆషాఢం మాసంలో పూజలు చేసే భక్తులంతా అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుంటున్నారు. మహిళలు కుంకుమపూజలు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వంటలు చేసుకుని భోజనాలు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పాయకరావుపేట రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదటం, కందిపూడి, చినకందిపూడి, పెదరాంభద్రపురం, కొత్తూరు, చిననర్సాపురం, పాల్తేరు, అంకంపేట, గ్రామాలలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వార్షిక మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

చోడమాంబిక అమ్మవారికి మంగళసూత్రాలు సమర్పణ

అచ్యుతాపురం రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చోడపల్లి చోడమాంబిక అమ్మవారికి 22 గ్రాముల బంగారు మంగళ సూత్రాలు నెల్లూరుకి చెందిన తలారి శ్రీనివాసరావు, సాంబశివరావు కుటుంబ సభ్యులు ఆదివారం సమర్పించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వడిసెల సన్యాసి నాయుడు, గంజి అప్పలరాజు, కర్రి వెంకటరమణ, వడిసెల శ్రీనివాసరావు, ప్రగడ రాము, కాకి శ్రీనివాస రావు, శంకర్ పాల్గొన్నారు.

తోటాడ వార్డు సభ్యుడు సత్యనారాయణ మృతి



మునగపాక, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటాడ పంచాయతీ 9వ వార్డు సభ్యుడు కాండ్రేగుల సత్యనారాయణ అనారోగ్య కారణంగా మృతి చెందాడు. మృతుడు సత్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలియడంతో సత్యనారాయణ కుటుంబసభ్యులను సర్పంచ్ దొడ్డి మంగవేణి, కోటేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు కాండ్రేగుల వెంకటలక్ష్మి, మద్దాల వీరునాయుడు, వైసీపీ నాయకులు బొడ్డేడ ప్రసాద్, షేక్ ఇస్మాయిల్, మాజీ సర్పంచ్ దాడి వీరమహలక్ష్మినాయుడు తదితరులు ఉన్నారు.

నేడు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

ఎలమంచిలి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులపై చర్చిస్తామన్నారు.

ఇంటర్ విద్యార్థిని పూజితకు సత్కారం


పూజితను సత్కరిస్తున్న బాబూరావు, నూకరాజు, అప్పలరాజు

ఎస్.రాయవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో 979 మార్కులు సాధించిన కోనవానిపాలెం గ్రామానికి చెందిన గొర్ల పూజితని జిల్లా యాదవ సంఘం ఆదివారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఆమెకు నగదు పురస్కారాన్ని అందజేసినట్టు యాదవ సంఘం పాయకరావుపేట నియోజకవర్గ అధ్యక్షుడు కోన అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడు కురందాసు నూకరాజు, జిల్లా కార్యదర్శి సబ్బి శ్రీను, నక్కపల్లి మండల యాదవ సంఘం అధ్యక్షుడు పాము సత్యనారాయణ పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి స్పందన ఫౌండేషన్ చేయూత

ఎస్.రాయవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త పోలవరం గ్రామానికి చెందిన అల్లు వెంకట విజయలక్ష్మికి స్పందన ఫౌండేషన్ అండగా నిలిచింది. డిగ్రీ చదువుతున్న వెంకట విజయలక్ష్మిని ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో రూ.15 వేల చెక్కును స్పందన ఫౌండేషన్ ప్రతినిధి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్. వెంకటరాజు ఆదివారం అందజేశారు.

నిబంధనలు పాటించని వాహనచోదకులపై చర్యలు

అచ్యుతాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నమ్మి గణేష్ అన్నారు. ఆదివారం సాయంత్రం అచ్యుతాపురం-ఎలమంచిలి రోడ్డులో గల వెదురువాడ కాటా వద్ద వాహనాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. భారీ వాహనాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. హెల్మెట్ లేని ద్విచక్రవాహనదారులు, రికార్డులు సరిగా లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు.

ప్రజలకు, ప్రభుత్వానికి అధికారులే వారధులు

▸ వీఆర్వోల సంఘ భవన శంకుస్థాపనలో ఎమ్మెల్యే కొణతాల ▸ రూ.లక్ష విరాళం ప్రకటించిన కలెక్టర్


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బొప్పరాజు, చిత్రంలో ఎమ్మెల్యే కొణతాల


శంకుస్థాపనలో భాగంగా శిలఫలకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు, ప్రభుత్వానికి అధికారులే వారధులని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని పాత కోర్టు సముదాయాల ముందు వీఆర్వోల సంఘం జిల్లా భవన నిర్మాణానికి ఆదివారం కలెక్టర్ విజయకృష్ణన్ శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కొణతాల మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా పనిచేయాలని సూచించారు. 50ఏళ్ల క్రితం మాజీ రాజ్యసభ సభ్యులు ద్రోణంరాజు సత్యనారాయణ హయాంలో ఈ భవనాన్ని నిర్మించారన్నారు. ప్రస్తుతం ఇది శిథిలావస్థకు చేరుకోవడంతో తొలగించి నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వల్ల రెవెన్యూ వ్యవస్థకు చెడ్డపేరు వస్తుందని వీరిని వెంటనే తొలగించాలన్నారు. వారి స్థానంలో ప్రభుత్వం ఖాళీ పోస్టులు భర్తీ చేసేలా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు చెప్పారు. నూతన భవన నిర్మాణానికి జిల్లా కలెక్టర్ రూ.లక్ష సొంత నిధులు ప్రకటించడం అభినందనీయమన్నారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ తాను జాయింట్ కలెక్టర్‌గా విజయవాడలో విధులు నిర్వహించినప్పుడు రెవెన్యూ ఉద్యోగుల సంఘ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించినట్టు తెలిపారు. ఇక్కడ రెవెన్యూ ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆరు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్‌ను, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, ఏపీఆర్ఎస్ఏ అమరావతి చైర్మన్, రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, వీఆర్వో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంటి, ప్రధాన కార్యదర్శి అనుపమ, జిల్లా గౌరవాధ్యక్షుడు ఈర్లె శ్రీరామ్మూర్తి, జిల్లా అధ్యక్షుడు రామకాసు, వీఆర్వోల సంఘం భవన నిర్మాణ కమిటీ ప్రతినిధులు ఎ.శశి, సీహెచ్.ఎరుకు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

: ఇక్కడి గాంధీనగరంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరాన్ని తొలుత ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సమక్షంలో ప్రారంభించారు. సుమారు 200 మంది రెవెన్యూ ఉద్యోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆర్డీవో షేక్ ఆయిషా, ఏపీఆర్ఎస్ఏ జనరల్ సెక్రటరీ ఆర్.వెంకటరాజేష్, జిల్లా అధ్యక్షుడు పీవీ రత్నం, ప్రధాన కార్యదర్శి వై.శ్రీరామ్మూర్తి, ఏపీజేఏసీ అమరావతి అధ్యక్షుడు ఎస్ఎస్‌వీఎస్ నాయుడు, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకాసు, కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి

▸ వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి రాక

▸ వేకువజామున విశేష పూజల అనంతరం దర్శనాలు


బాలాలయంలో అమ్మవారు

అనకాపల్లి టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వేకువ జామున అర్చకులు బాలాలయంలోని అమ్మ వారికి విశేష అలంకరణలు చేపట్టిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారికి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. కుటుంబాలతో విచ్చేసిన వారు ఆలయ ఆవరణతో పాటు చుట్టుపక్కల తోటల్లో వంటలు తయారుచేసి నైవేద్యంగా సమర్పించిన అనంతరం ఆరగించారు. ఆలయ ఈవో వెంపలి రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

'వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై వేధింపులు సరికాదు'


ప్రిన్సిపాల్ అన్నపూర్ణను పరామర్శిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై చోడవరం ఎమ్మెల్యే రాజకీయ వేధింపులు చేయడం సరికాదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయి అన్నారు. ఇక్కడి శారదా కాలనీలో నివాసముంటున్న ప్రిన్సిపాల్ అన్నపూర్ణను ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పదవిలో ఉన్న చోడవరం ఎమ్మెల్యే రాజు తన నియోజకవర్గంలో పనిచేస్తున్న ఉద్యోగులకు, మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాల్సిందిపోయి ఒత్తిళ్లకు గురిచేయడం తగదన్నారు. రాజకీయ వేధింపులకు గురిచేస్తే రాష్ట్రస్థాయి ఉద్యమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ప్రిన్సిపాల్ విషయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ప్రిన్సిపాల్‌ను పరామర్శించిన వారిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ వీవీ శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పరమేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు నాగిరెడ్డి సత్యనారాయణ ఉన్నారు. అలాగే, వైసీపీ జిల్లా, పట్టణ నాయకులు కూడా ప్రిన్సిపాల్ అన్నపూర్ణను పరామర్శించి ధైర్యం చెప్పారు.

కొత్తూరు బ్రిడ్జిపై రోడ్డుకు మరమ్మతులు ప్రారంభం

కొత్తూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ పరిధి ఏఎంఏఎల్ కళాశాల వద్ద గల ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రోడ్డు మరమ్మతు పనులు ఎట్టకేలకు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ నిధులు రూ.30 లక్షలతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ మరమ్మతు పనుల వలన బీఆర్‌టీ కాలనీ, సంపతిపురం, వుడా కాలనీ, అచ్చియ్యపేట, సుందరయ్యపేట, జంగాలపాలెం, కూండ్రం, కుంచంగి తదితర గ్రామీణ ప్రాంత ప్రజలు రాకపోకలకు అనువుగా ఉంటుందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులు మళ్ల శ్రీను, ఆడారి సత్తిబాబు, మద్దాల నాగఅప్పారావు, ఆడారి శ్రీనివాసరావు, అనకాపల్లి శేషు తదితరులు పనులను పర్యవేక్షించి ఆనందం వ్యక్తం చేశారు.

టీడీపీ శ్రేణులు మరింత నిబద్ధతతో పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వార్డు పరిశీలకుడు కిరణ్‌కుమార్

లంకెలపాలెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ శ్రేణులంతా పార్టీ కోసం మరింత నిబద్ధతతో పనిచేయాలని జీవీఎంసీ 79వ వార్డు టీడీపీ పరిశీలకుడు కిరణ్‌కుమార్ సూచించారు. ఆదివారం ఇక్కడి కార్యాలయంలో నూతన కమిటీ ప్రతినిధులు, టీడీపీ శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. తద్వారా పార్టీ మరింత బలోపేతం కావడమే లక్ష్యం కావాలన్నారు. వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మాట్లాడుతూ జూలై రెండో తేదీ నుంచి ఇంటింటికీ తిరిగి ప్రజలను చైతన్య పరచాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కరణం జగదీశ్, నాయకులు కోటేశ్వరరావు, శివకుమార్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

తుమ్మపాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులు విశాఖ డెయిరీ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి అన్నారు. తుమ్మపాలలో గల విశాఖ డెయిరీ పాల కేంద్రం -2లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పాడి రైతులకు లబ్ధి చేకూర్చేందుకు డెయిరీ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. అనంతరం మాటూరి నాగరాజు, యాదగిరి శ్రీనులను ఏకగ్రీవంగా డెయిరీ డైరెక్టర్లగా ఎన్నుకున్నారు. అలాగే సుఖీభవ కార్డులు కలిగిన 44 మంది సభ్యులకు పశుదాణా బేసిన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ సూపర్‌వైజర్ ఎడ్ల ఏసుదాసు, డెయిరీ అధ్యక్షుడు పెద్దిశెట్టి బద్రీ నారాయణ, వేతన కార్యదర్శి దిమ్మల అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వారాహిదేవి అలంకరణలో కనకదుర్గమ్మ


గవరపాలెం సతకంపట్టు, దేవీపురంలలో అలంకరణలో అమ్మవారు

అనకాపల్లి టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం సతకంపట్టులో కనకదుర్గమ్మ ఆదివారం వారాహిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆషాఢమాసం శుద్ధ పంచమి సందర్భంగా తొలుత కనకదుర్గమ్మను ప్రధాన అర్చకులు భోగాపురపు వెంకటరమణ, ఉదయగిరి చంద్రశేఖర్‌లు వారాహిదేవిగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని దేవీపురంలో వారాహీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు విశేష కాసు అలంకణలో భక్తులకు దర్శనమిచ్చారు. గురు పత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తిని తొలుత అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

పరవాడలో మోస్తరు వర్షం


పరవాడ పెట్రోల్ బంకు జంక్షన్‌లో రహదారిపై నిలిచిన నీరు

పరవాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ, పరిసర ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజామున వర్షం కురిసింది. సుమారు 45 నిముషాల పాటు పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల ప్రధాన రహదారులపై వర్షపునీరు నిలిచిపోయింది. దేశపాత్రునిపాలెం, కలపాక తదితర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. సాయంత్రం కూడా చిరుజల్లులు కురిశాయి. కాగా ఈ వర్షం కూరగాయల పంటలకు ఊపిరి పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే, వర్షం కారణంగా పలు గ్రామీణ రహదారులు చిత్తడిగా మారాయి. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ అమలుచేయాలి

▸ జిల్లా యాత సంక్షేమ సంఘం ప్రతినిధుల డిమాండ్


సంఘీభావం తెలుపుతున్న యాత సంక్షేమ సంఘం ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్ అమలు పరచాలని అనకాపల్లి జిల్లా యాత సంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం అనకాపల్లిలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పి.మారేష్ మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు బీసీ రిజర్వేషన్‌లను వర్గీకరణ ప్రకారం అమలు చేయాలని కోరారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అమలులో ఉన్న బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ రాజకీయ రంగంలో లేకపోవడం విచారకరమన్నారు. బీసీలను ఏ బీ సీ డీ కేటగిరి ప్రకారం రిజర్వేషన్ కేటాయించి అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గుత్తుర్తి అప్పారావు, న్యాయవాది ఒడిబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

▸ హాస్టల్‌లో ఉంటున్న కుమారుడిని చూసేందుకు వెళుతుండగా ఘటన


విజయలక్ష్మి (ఫైల్ ఫొటో)

సబ్బవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. అనకా పల్లి-ఆనందపురం జాతీయ రహదారి చిన్నియ్యపాలెం పెట్రోల్ బంకు వద్ద ఆదివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన దుంగల శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు విశాఖపట్నం జిల్లా తగరపువలస వద్ద గల ఓ ప్రైవేటు రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న తమ కుమారుడిని చూసేందుకు బైక్‌పై బయలుదేరారు. సబ్బవరం దరి చిన్నయ్యపాలెం వద్దకు వచ్చేసరికి మిరియాలగూడ నుంచి ఒడిశా వెళుతున్న లారీ వెనుక నుంచి వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో విజయలక్ష్మి రోడ్డుపై పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త శ్రీనివాసరావుకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జి.రామచంద్రరావు తెలిపారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

యాదవ సామాజిక వర్గానికి చెందిన ఉత్తమ విద్యార్థుల సత్కారంలో 'కొణతాల'


విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు గర్వించేలా విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఇక్కడి నూకాంబిక ఆలయానికి వెళ్లే మార్గంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆ సామాజికవర్గానికి చెందిన ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లాలోని 200 మంది పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతో పాటు సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు బొర్నికాన సాయినాథరావు (బాబూరావు) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కోన తాతరావు, వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు బొర్నికాన రామారావుతో పాటు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'9న కార్మిక సమస్యలపై దేశవ్యాప్త సమ్మె'



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పదకొండు కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు ఇచ్చిన పిలుపు మేరకు జూలై తొమ్మిదవ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.లోకనాథం, ఆర్. శంకర్రావు పిలుపునిచ్చారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మికులు పది గంటల సేపు పనిచేసే విధంగా నిర్ణయించడం సరికాదన్నారు. కార్మికులకు సమ్మె హక్కు లేకుండా చేస్తుందని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఎనిమిది గంటల పని విధానం పది గంటలకు చేయడం తగదన్నారు. ఈ సమస్యలపై తొమ్మిదో తేదీన జరిగే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు జి.కోటేశ్వరరావు, ఎం.నాగేషు, జి.వరలక్ష్మి, ఎ.రాజు, పరమేశ్వరరావు, శాంతి తదితరులు పాల్గొన్నారు.


అనకాపల్లిలో వరాహావతారంలో జగన్నాథస్వామి

వరాహావతారంలో జగన్నాథుడు

అనకాపల్లి టౌన్/ కశింకోట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జగన్నాథ రథోత్సవం నేత్రపర్వంగా సాగుతోంది. ఇందులో భాగంగా అనకాపల్లి గూడ్స్ షెడ్డు వద్ద గల ఇంద్రద్యుమ్న మందిరం, కశింకోటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో కొలువుదీరిన సుభద్ర, బలభద్ర సమేత స్వామివారు ఆదివారం భక్తులకు వరహావతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేకువజామున అర్చకులు విశేష అలంకరణలు చేపట్టి, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పాలకవర్గ సభ్యులు, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కశింకోట కృష్ణ మందిరంలో..

వచ్చే నెల 6న వెంకన్న గిరి ప్రదక్షిణ



పరవాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీ కొండపై కొలువైన అభయ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తొలిసారి గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వచ్చే నెల ఆరో తేదీన తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆ రోజు సాయంత్రం 4.05 గంటలకు స్వామివారి పాదాల నుంచి గిరి ప్రదక్షణ ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ గిరి ప్రదక్షణ గౌతు లచ్చన్ననగర్, పెట్రోల్ బంక్, మండల పరిషత్ జంక్షన్‌ల గుండా ఈ.బోనంగి ఆంజనేయస్వామి ఆలయం, బీకే స్టీల్ పరిశ్రమ, ఫార్మాసిటీ కాలనీ మీదుగా స్వామివారి పాదాలకు చేరుకుంటుందని వివరించారు. పరవాడ, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

గెడ్డవాగులో నిర్మించిన కల్వర్టు కూల్చివేత

సబ్బవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : వెదుళ్లనరవలోని సర్వే నెంబరు 94 గెడ్డవాగులో అనుమతులు లేకుండా నిర్మించిన కల్వర్టును ఆదివారం తహసీల్దార్ బి.చిన్నికృష్ణ ఆదేశాల మేరకు ఆర్ఐ వీరయ్య, వీఆర్వో రాంబాబు ఎక్స్‌కవేటర్ సహాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెడ్డవాగుపై కల్వర్టు నిర్మాణానికి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. అక్రమంగా కల్వర్టు నిర్మించడం నేరమన్నారు. రైతులకు కల్వర్టు అవసరమైతే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రామాలయం నిర్మాణానికి రూ. మూడు లక్షల విరాళం


కమిటీకి విరాళం అందజేస్తున్న చంద్రశేఖర్

సబ్బవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): టెక్కలిపాలెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న రామాలయానికి సబ్బవరం శివారు చినగొల్లలపాలేనికి చెందిన రేమాల చంద్రశేఖర్ మూడు లక్షల రూపాయలను ఆదివారం విరాళంగా అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, సర్పంచ్ గొంప సత్యవమ్మ, నాయనప్ప, పైల రమణ, పంచాడ శ్రీనివాసరావు చంద్రశేఖర్‌లకు అందించారు. ఈ సందర్భంగా వారు దాతను సత్కరించారు.

ప్రజానాట్య మండలి శిక్షణ తరగతులు

తుమ్మపాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లిలో వచ్చే నెల 30,31 తేదీల్లో ప్రజా నాట్యమండలి శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్టు నాట్యమండలి గౌరవాధ్యక్షుడు రాజాన దొరబాబు తెలిపారు.



కాడెలి గ్రామంలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామ కమిటీ ప్రతినిధులు

గ్రామ కమిటీలతో టీడీపీ మరింత బలోపేతం

▸ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు సత్యనారాయణ

పాడేరు రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ కమిటీలతో టీడీపీ మరింత బలోపేతమవుతుందని ఆ పార్టీ సంస్థాగత మండల ఎన్నికల పరిశీలకుడు సత్యనారాయణ చెప్పారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ అధ్యక్షతన మండలంలో కాడెలి పంచాయతీ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గ్రామ కమిటీ ఎన్నికల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ కమిటీలు ఉత్సాహంగా పనిచేస్తూ పార్టీని ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లాలన్నారు. అలాగే జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకటసురేశ్‌కుమార్, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి తదితరులు మాట్లాడారు. గ్రామ కమిటీ అధ్యక్షురాలుగా మునగ కనకరత్నం, కార్యదర్శిగా శక్తి కుమారి, మరో పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన గ్రామ కమిటీతో నేతలు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మరో పరిశీలకుడు వంతాల నాగేశ్వరరావు, లగిశపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ, యూనిట్ ఇన్‌చార్జి బి.శ్రీను, బూత్ కన్వీనర్లు శోభ శ్రీను, డి.కల్యాణం, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం మల్లికార్జునరావు సేవలు ఆదర్శనీయం

ముంచంగిపుట్టు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగురాయి పంచాయతీ చోటాముఖిపుట్టు పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన దేశిది మల్లికార్జునరావు సేవలు ఆదర్శనీయమని వక్తలు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన అభినందన సభలో మల్లికార్జునరావు, వెంకటవిజయలక్ష్మి దంపతులను ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, వివిధ పార్టీల నాయకులు సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మల్లికార్జునరావు 41 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో చేసిన సేవలు మరువలేనివన్నారు. మల్లికార్జురావు దగ్గర చదువుకున్న విద్యార్థులు ఎంతో మంది వివిధ రంగాల్లో రాణిస్తున్నారని, ఆయన కృషి అమోఘమని పేర్కొన్నారు.

ఫేసియల్ పరేషాన్!

... 5వ పేజీ తరువాయి

పరిధిలో 5,273 మంది లబ్ధిదారులకు గాను 5,101 మందికి ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమోదయ్యారు. ఇంకా 172 మంది నమోదు కావలసి ఉంది.

- వి.మాడుగుల ప్రాజెక్టు పరిధిలో 3,240 మంది లబ్ధిదారులకు గాను 2,971 మందికి పూర్తి చేశారు. ఇంకా 269 మంది మిగిలిపోయారు.
- ఎలమంచిలి ప్రాజెక్టు పరిధిలో 8,437 మంది లబ్ధిదారులకు గాను 7,655 మంది ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమోదయ్యారు. ఇంకా 782 మంది మిగిలిపోయారు.

దడ పుట్టించే దారులు

... 5వ పేజీ తరువాయి

హడలిపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత దుర్భరంగా తయారైంది. ముఖ్యంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించేవారి అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రోడ్డు వంక కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. దీనికి తోడు అప్పట్లో అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఫిల్లింగ్ పనుల కోసం పరవాడ ఎన్టీపీసీ బూడిదను తరలించేవారు. దీంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని అంటున్నారు. అయినప్పటికీ కనీస మరమ్మతులు చేపట్టలేదు. ఫలితంగా ఎక్కడికక్కడ రెండు అడుగుల నుంచి మూడు అడుగుల లోతులో గుంతలు ఏర్పడ్డాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ కృషితో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఎన్టీపీసీ నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్‌ఆర్) నిధులు రూ.70 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో లంకెలపాలెం నుంచి పెదముషిడివాడ, ఫైడివాడఅగ్రహారం సమీపం వరకూ మరమ్మతు పనులు పూర్తి చేయించారు. ఫైడివాడ అగ్రహారం నుంచి అనకపల్లి వరకూ మరమ్మతు పనులకు అనుకూలంగా ఉన్నచోట్ల పనులు పూర్తిచేశారు. అయితే కొన్నిచోట్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమై పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో మరమ్మతులు చేయడానికి వీలు పడలేదని అధికారులు చెబుతున్నారు. పూర్తి స్థాయిలో మరమ్మతు పనులు చేసేందుకు నిధులు చాలకపోవడంతో తాత్కాలికంగా పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరింత దారుణంగా తయారైంది. కాగా ఈ మార్గంలో ఇప్పటికీ భారీ డంపర్లు పరిమితికి మించి లోడుతో రాకపోకలు సాగిస్తుండడం వల్ల రోడ్డు పాడవుతోందని స్థానికులు అంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా వాహనచోదకులు కోరుతున్నారు. అనకపల్లి నుంచి ఫైడివాడఅగ్రహారం వరకు నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డును బాగు చేసేందుకు ప్రభుత్వం రూ2.5 కోట్లు మంజూరు చేసిందని ఆర్అండ్‌బీ శాఖ జేఈ బాలరాజు తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. గతంలో ఈ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టేందుకు అవకాశం లేనంతగా పాడై పోయిందని చెప్పారు.

ప్రాణం తీసిన ఈత సరదా

... 5వ పేజీ తరువాయి

ఒడ్డుకు చేర్చారు. అయితే అప్పటికే ఖ్యాతితేజ నీరు ఎక్కువగా తాగేయడంతో స్పృహ కోల్పోయి అపస్మారక స్థితిలో ఉన్నాడు. చుట్టుపక్కల వారి సాయంతో ఖ్యాతితేజ, కౌశల్‌లను స్నేహితులు మాడుగుల ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఖ్యాతితేజ(33) మృతి చెందినట్టు నిర్ధారించారు. కౌశిల్‌కి ప్రథమ చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండడంతో 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడు ఖ్యాతితేజ విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్టు సమాచారం. కౌశల్ విశాఖపట్నంలో సీలింగ్ వర్క్ చేస్తుంటాడు. ఇతనికి కూడా వివాహమైంది. ప్రమాద విషయం తెలుసుకున్న మాడుగుల ఎస్ఐ నారాయణరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించామని, మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇచ్చిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ఏయూలో క్వాంటమ్ కంప్యూటింగ్

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించేందుకు వర్సిటీకి అవకాశం దక్కింది. తొలి ఏడాది 30 సీట్లలో ప్రవేశాలు కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈఏపీసెట్ ర్యాంకర్లకు మాత్రమే ప్రవేశాలు కల్పించనున్నారు. కోర్సులో చేరే విద్యార్థులకు రూ.79 వేలు ఫీజుగా నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించే విద్యార్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం ఉండదని చెబుతున్నారు. కంప్యూటర్ సైన్స్, ఈసీఈ వంటి బ్రాంచ్‌ల మాదిరిగా ప్రత్యేక బ్రాంచ్‌గా ఈ కోర్సును నిర్వహించనున్నారు.

అత్యాధునిక ల్యాబ్‌లు అవసరం

క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు నిర్వహణకు అత్యాధునిక ల్యాబ్‌లు అవసరం. ఇందుకోసం కొన్ని ప్రైవేటు సంస్థల ల్యాబ్ సేవలను వర్చువల్ విధానంలో వినియోగించుకోవాలని వర్సిటీ అధికారులు భావిస్తున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ ల్యాబ్‌లు అమెజాన్, మైండ్ ట్రీ, గూగుల్ వంటి సంస్థలకున్నాయి. వాటిని వర్చువల్ విధానంలో బోధనకు వినియోగించుకునేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చినట్టు చెబుతున్నారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సుగా నిర్వహణ..

క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును దేశంలోని కొన్ని విద్యా సంస్థలు ఇంటిగ్రేటెడ్ కోర్సుగా నిర్వహిస్తున్నాయి. ఈ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయంటున్నారు. భవిష్యత్తు టెక్నాలజీ, ఆవిష్కరణలు దీనిచుట్టే తిరుగుతున్న నేపథ్యంలో కోర్సు నిర్వహణ వర్సిటీకి జాతీయస్థాయిలో గుర్తింపును తీసుకువస్తుందని ఏయూ అధికారులు చెబుతున్నారు.

వంతెనలు ఇలా.. రాకపోకలు ఎలా?

▸ తుఫాన్‌కు కొట్టుకుపోయిన చిన్నగంగవరం బ్రిడ్జి

▸ ఏడాదిగా పట్టించుకోని అధికారులు, పాలకులు

▸ చిన్నగంగవరం పరిసర ప్రాంత గిరిజనుల అవస్థలు





గత ఏడాది సంభవించిన తుఫాన్‌కు కొట్టుకుపోయిన చిన్నగంగవరం వంతెన... అసంపూర్తిగా నిలిచిపోయిన మాదిమళ్ల అప్రోచ్ పనులు

సీలేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం దారకొండ పంచాయతీ పరిధిలోని చిన్నగంగవరం వంతెన లేక గిరిజనులు అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గత ఏడాది సెప్టెంబరు 8న ఈ ప్రాంతంలో వచ్చిన తుఫాన్ ప్రభావానికి ఈ వంతెన కొట్టుకుపోయింది, దీంతో ఈ ప్రాంత గిరిజనులు శ్రమదానంతో వంతెనపక్కనుంచి తాత్కాలికంగా రాళ్లు, మట్టి వేసుకుని రాకపోకలు సాగిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుత వర్షాలకు మట్టి రోడ్డు బురదమయమై వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు పేర్కొన్నారు. ప్రధానంగా గర్భిణులకు అత్యవసర పరిస్థితులలో అంబులెన్సు కూడా రాని పరిస్థితి నెలకొంటుందన్నారు.ఈ వంతెన ఆవల చిన్నగంగరవరం, పెద్దగంగవరం, నరమామిడిగొంది, పేట్రాయితోపాటు పలు ఒడిశా గ్రామాల ప్రజలు నిత్యవసర సరకులకు, వైద్య సేవలు పొందాలన్నా దారకొండ గ్రామానికి ఈ వంతెన దాటి రావాల్సిందే. వంతెనలేక ప్రధానంగా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై అధికారులు స్పందించకుంటే ఆందోళన చేపట్టాల్సి ఉంటుందని జనసేన నాయకుడు టొక్కుబాబు, సీపీఐనేత కవర్ల భగవాన్ హెచ్చరించారు.

అసంపూర్తిగా మాదిమళ్లు వంతెన అప్రోచ్ పనులు

గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని మాదిమళ్ల వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. గత ఏడాది సెప్టెంబరు 8వ తేదీన తుపాన్ ప్రభావానికి మాదిమళ్ల వంతెన వద్ద అప్రోచ్ కొట్టుకుపోయి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. యుద్ధ ప్రాతిపదిక గ్రావెల్ వేసి రాకపోకలు తాత్కాలికంగా పునరుద్ధరించారు. అయితే, భారీ వర్షాలు కురిసిన సమయంలో అప్రోచ్ వద్ద వేసిన మట్టి బురదమయమై వాహనాలు వెనక్కి జారి ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఏప్రిల్‌లో నర్సీపట్నం-గుమ్మిరేవుల బస్సు బురదలో కురుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తతంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో వర్షం పడిన ప్రతిసారీ గుమ్మిరేవులకు బస్సు నడపడం లేదు. దీంతో పలు గ్రామాల గిరిజనులు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు ఈ వంతెన అప్రోచ్ నిర్మాణానికి ఎస్‌సీఏ నిధుల నుంచి రూ. 1.40 కోట్లు మంజూరైనా, పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి వంతెన అప్రోచ్ పనులను త్వరితగతిన పూర్తి చేయించి గుమ్మిరేవులపాతకోట, మారేడిమిల్లి ప్రాంతాల ప్రజలకు రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గిరిజన ప్రాంతంలో టీడీపీకి పూర్వ వైభవం

▸ పార్టీ మండల పరిశీలకుడు దాసుబాబు



గ్రామ కమిటీ ఎన్నికలకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

చింతపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో టీడీపీకి పూర్వ వైభవం కనిపిస్తున్నదని పార్టీ మండల పరిశీలకుడు పి.దాసుబాబు పేర్కొన్నారు. మండలంలోని ఆరు పంచాయతీల్లో ఆదివారం టీడీపీ సభలు ఏర్పాటు చేసి గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిలోనే గిరిజన ప్రాంతాల అభివృద్ధికి చంద్రబాబు పెద్దపీట వేశారన్నారు. గిరిజన గ్రామాలకు రూ.వెయ్యి కోట్లతో రహదారుల నిర్మాణం చేపడుతున్నారన్నారు. అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు చేశారన్నారు. ప్రతీ గ్రామంలోనూ జలజీవన్ మిషన్ పథకం ద్వారా మంచినీటి పథకాలు నిర్మించారన్నారు. అత్యధిక సంఖ్యలో ఆదర్శ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి టీడీపీలో చేరుతున్నారన్నారు.

గ్రామ కమిటీల అధ్యక్షులు వీరే...

అనంతరం గ్రామ కమిటీలకు అధ్యక్షులను నియమించారు. కొత్తపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దేశగిరి సుఖ్‌దేవ్ నియమితులయ్యారు. అలాగే తాజంగి అధ్యక్షుడిగా సిరగం మల్లేశ్వరరావు, అంజలిశనివారం అధ్యక్షుడిగా లకే రామస్వామి, కిటుములకు గెమ్మెలి వెంకటరావు, లంబసింగికి బోనంగి సోమలింగం పడాల్, పెద్దబరడకు వనుము సాయి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, క్లస్టర్ ఇన్‌చార్జి పాంగి రాము, సీనియర్ నాయకులు కిముడు లక్ష్మయ్య, శెట్టి నాగేశ్వరరావు, రమణ, మహేంద్ర, పార్వతి, అబ్బాయి నాయుడు పాల్గొన్నారు.

రహదారుణం

▸ తోటాపుట్టు మట్టి రోడ్డు బురదమయం

▸ తాత్కాలికంగా మరమ్మతు చేసుకున్న గ్రామస్థులు

▸ సీసీ రోడ్డు నిర్మించాలని వేడుకోలు



మట్టి రహదారి తాత్కాలిక మరమ్మతు చేసుకుంటున్న గిరిజనులు

ముంచంగిపుట్టు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో సుజనకోట పంచాయతీ పరిధిలోని తోటాపుట్టు గ్రామంలో రహదారి దారుణంగా తయారైంది. వర్షాలకు మిట్టి రోడ్డు కాస్త బురదమయమైంది. దీంతో ఆదివారం ఆ గ్రామానికి వచ్చిన బోర్‌వెల్ లారీ సమీపంలోని బురదలో కూరుకుపోయింది. అతి కష్టంపై గ్రామస్థులు లారీని బయటకు తీసుకువచ్చారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా సుమారు కిలోమీటరు మట్టి రహదారి బురదమయంగా మారడంతో, అటుగా వాహన రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనం సైతం గ్రామానికి అతికష్టంపై తీసుకు వెళ్లాల్సి వస్తున్నది. సీసీ రోడ్డు మంజూరు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు వినతులు అందించినా ఫలితం కానరావడం లేదని గ్రామస్థులు నారాయణ, భగత్‌రాం, సుబ్బారావు, మధు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మెయిన్ రోడ్డును కలుపుతూ సుమారు 500 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణం చేపడితే రవాణా కష్టాలు గట్టెక్కుతాయని వారు పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న మట్టి రహదారిని గ్రామస్థులంతా కలిసి స్వచ్ఛందంగా మరమ్మతులు చేసుకున్నారు. అయినప్పటి ఈ మార్గంలో ప్రయాణం కష్టమని, అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కట్టడాల తొలగింపునకు వర్తకుల సన్నద్ధం



రోడ్డు మధ్యలో 35 అడుగుల కొలతలు తీసుకుంటున్న వర్తకులు

చింతపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ స్థలంలో కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకునేందుకు వర్తకులు ముందడుగు వేశారు. ఆదివారం వర్తకులంతా వ్యక్తిగతంగా రహదారి మధ్యలో నుంచి కొలతలు తీసుకుని 35 అడుగులలోపు ఉన్న దుకాణ కట్టడాలను తొలగించుకుంటున్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రధాన కేంద్రాల్లో రహదారికి ఇరువైపులా అక్రమ కట్టడాలను తొలగించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు ప్రారంభించారు. శనివారం ఇక్కడికి వచ్చిన జిల్లా కలెక్టర్ చింతపల్లిలో డబుల్ రోడ్డు నిర్మాణం జరుగుతుందని, రహదారికి ఇరువైపులా 35 అడుగుల స్థలాన్ని ఖాళీ చేయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వర్తకులు స్వచ్ఛందంగా కట్టడాలను తొలగించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

ఐఐఎంఆర్ సహకారంతో రైతులకు టార్పాలిన్లు

▸ లంబసింగి ట్రైబల్ ఎఫ్‌పీవో డైరెక్టర్ ఇంద్రరాణి

చింతపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్) సహకారంతో గిరిజన రైతులకు ఉచితంగా టార్పాలిన్లు పంపిణీ చేస్తున్నట్టు లంబసింగి ట్రైబల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ కూడ ఇంద్ర రాణి చెప్పారు. ఆదివారం పలువురు రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు విలువలు జోడించి మార్కెటింగ్ చేయడం జరుగుతుందన్నారు. దీంతో అధిక ఆదాయం లభిస్తుందన్నారు. గిరిజన రైతులు వ్యవసాయ అవసరాలకు ఉపయోగించుకునేందుకు ఈ టార్పాలిన్లు దోహదపడతాయని ఆమె చెప్పారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఎఫ్‌పీవో వద్ద కొర్రలు, రాగి, సామలు, జొన్నల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు.



గిరిజన రైతులకు టార్పాలిన్ అందజేస్తున్న ఎఫ్‌పీవో డైరెక్టర్ ఇంద్రరాణి

సత్ఫలితాలిస్తున్న విద్యా రంగ సంస్కరణలు


నక్కపల్లి మండల విద్యాశాఖాధికారులకు

మంత్రి నారా లోకేశ్ అభినందనలు

దేవవరం మోడల్ ప్రాథమిక పాఠశాలలో

ఒకే రోజు 32 మంది ప్రైవేటు పాఠశాలల పిల్లలు చేరిక

ట్విట్టర్‌లో 'ఆంధ్రజ్యోతి' కథనం.. పోస్టు చేసిన మంత్రి లోకేశ్



ట్విట్టర్‌లో ఆంధ్రజ్యోతి కథనంతో నారా లోకేశ్ పోస్ట్ చేసిన దృశ్యం

నక్కపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో గత ఏడాది కాలంగా విద్యావ్యవస్థలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయని, ఇందుకు నక్కపల్లి మండలం దేవవరం మోడల్ ప్రైమరీ స్కూల్ ఒక ఉదాహరణగా నిలుస్తుందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీన దేవవరం మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఒకే రోజు 32 మంది పిల్లలు పలు ప్రైవేట్ పాఠశాలల నుంచి ఈ బడిలో చేరారు. దీనిపై ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రభుత్వ పాఠశాలల వైపు..పిల్లల చూపు శీర్షికతో ప్రచురితమైన వార్తను మంత్రి లోకేశ్ చూశారు. ఈ కథనంపై ఆయన ట్విట్టర్, ఇతర సోషల్ మీడియాల్లో తన అభిప్రాయాన్ని పోస్ట్ చేశారు. ఒకే రోజు 32 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి దేవవరం మోడల్ ప్రాథమిక పాఠశాలలో చేరడం హర్షణీయమని లోకేశ్ పేర్కొన్నారు. ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ కోసం తాను చేస్తున్న కృషిలో భాగస్వామ్యంగా నిలుస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంత్రి అభినందనలు తెలియజేశారు. 'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి నారా లోకేశ్ స్పందించిన అంశం నియోజకవర్గంలోనూ, జిల్లా విద్యాశాఖలోనూ వైరల్ అవుతోంది.

మహిళా సర్పంచులకు శిక్షణ

కొయ్యూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిపాలనపై మహిళా సర్పంచులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో జీవీడీ ప్రసాద్ తెలిపారు. నర్సీపట్నం మండల పరిషత్ కార్యాలయంలో వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. మండలంలోని 19 మంది మహిళా సర్పంచులు ఈ శిక్షణ శిబిరానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. శిక్షణ కాలంలో సర్పంచులకు అన్ని వసతులు కల్పిస్తారని ఆయన తెలిపారు.

రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

చింతపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివారు అంజలి శనివారం పంచాయతీలో రోడ్ల నిర్మాణాలకు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.1.65 కోట్ల ఉపాధి పథకం నిధులతో ప్రభుత్వం మెటల్ రోడ్లు నిర్మిస్తున్నదని ఈ సందర్భంగా సర్పంచ్ పి.రాజుబాబు తెలిపారు. ఈదులుబయలు-దోనిబంద రోడ్డుకు రూ.90 లక్షలు,ఈదులుబయలు-కోటలగరువు రోడ్డుకు రూ.70 లక్షలు మంజూరయ్యాయన్నారు. నెల రోజుల్లో ఈరహదారుల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాగిన వెంకటరావు, సీపీఐ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు, ఉప సర్పంచ్ కిముడు ఉత్తరకుమారి పాల్గొన్నారు.

నందివలస-బస్కీ రోడ్డులో సీసీ ర్యాంప్‌లు వేయాలి

అరకులోయ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నందివలస జంక్షన్ నుంచి బస్కీ రహదారిలో సీసీ ర్యాంప్‌లు వేయాలని గిరిజన సంఘం అల్లూరి జిల్లా కార్యదర్శి బాలదేవ్ డిమాండ్ చేశారు. రోడ్డు వద్ద మట్టి లెవెల్ చేసి వదిలేయడంతో వర్షాలకు బురదమయంగా మారిందని, దీంతో ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ రహదారి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ తక్షణమే సీసీ ర్యాంప్‌లను వేయాలని డిమాండ్ చేశారు. ఈ పనుల నాణ్యతను పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని ఆయన కోరారు.

స్థానిక ఎన్నికల్లో టీడీపీకి అధిక స్థానాలు

▸ పార్టీ మండల పరిశీలకుడు రెహమాన్

జి.మాడుగుల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు టీడీపీ సొంతం చేసుకునేలా గ్రామ కమిటీలు పనిచేయాలని పార్టీ మండల పరిశీలకుడు ఎస్ఆర్ రెహమన్ సూచించారు. మండలంలోని కె.కోడాపల్లి, కుంబిడిసింగి, వంతల, పెద్దలోచలి, సొలభం, వంజరి, గడుతూరు, గెమ్మెలి పంచాయతీల్లో ఆదివారం గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పరిశీలకుడు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పార్టీ కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. తద్వారా గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎల్.అప్పలరాజు, నాయకులు ఎస్.చిట్టిబాబు, వి.కొండలరావు, కె.కల్యాణం, ఎస్.నాగబ్బాయి, వి.చిరంజీవినాయుడు, ఎల్.బాలయ్యదొర, పి.భీంబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అనంతగిరి ఎన్నికల పరిశీలకుడిగా డప్పోడి వెంకటరమణ



వెంకటరమణ

అనంతగిరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా తెలుగు యువత పాడేరు నియోజకవర్గ అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ నిలమితులయ్యారు. పాడేరు పదో క్లస్టర్ ఇన్‌చార్జి, తెలుగు యువత అధ్యక్షుడిగా అందించిన సేవలను గుర్తిస్తూ ఎన్నికల పరిశీలకుడిగా చోటు కల్పించడం సంతోషంగా ఉందని, అందరినీ సమన్వయం చేసుకుంటూ సంస్థాగత ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా డప్పోడి వెంకటరమణ ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. తనను నమ్మి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన డీలర్లకు ఇంటింటికీ రేషన్ పంపిణీ కష్టాలు

డుంబ్రిగుడ,జూన్29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగుకు ఇంటికే రేషన్ సరకులు పంపిణీ చేయాలన్న ఆదేశాలతో గిరిజన డీలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందులో భాగంగా ఇంటి వద్దకే సరకులు అందించడానికి రేషన్ డీలర్లు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ కాలినడకన వృద్ధుల వద్దకు వెళ్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే డీలర్లు తక్కువ కమిషన్‌తో కుటుబ పోషణ సాగిస్తున్నామని, తమ కష్టాలను ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక అలవెన్సులు అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



వర్షం నీటితో చెరువును తలపిస్తున్న కృష్ణాదేవిపేట బస్ స్టేషన్

వర్షాలతో బస్ స్టేషన్ అధ్వానం

కృష్ణాదేవిపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట బస్ స్టేషన్ వర్షాలతో అధ్వానంగా తయారైంది. కాంప్లెక్స్ ఆవరణ మొత్తం నీటితో నిండిపోయింది. చెరువును తలపించేలా పరిసరాలు ఉండడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. కాగా, ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, చోద్యం తదితర గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి పలుమార్లు వర్షం పడింది. దీంతో వీధి రోడ్లు కూడా జలమయమయ్యాయి. గ్రామాల్లో సీసీ, మట్టి రోడ్లపై డ్రైనేజీలు లేక మురుగు నీరు ఏరులై పారింది. ఈ వర్షం ఖరీఫ్ సాగుకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తాండవ రహదారి ఛిద్రం



బురదమయమైన తాండవ రహదారి

నాతవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండవ-నాతవరం రహదారి చిన్న వర్షానికే ఛిద్రమవుతోంది. రోడ్డు బురదమయం కావడంతో ద్విచక్ర వాహనదారులు ఎక్కడ జారిపడతామోనని భయపడుతున్నారు. మూడు మండలాల పరిధిలోని 16 గ్రామాలకు ఉపయోగపడే తాండవ రహదారికి దాదాపు 20 ఏళ్లుగా మరమ్మతులు చేపట్టలేదని ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. జల వనరుల శాఖ ఆధీనంలో ఉన్న తాండవ రోడ్డును ఇటీవల ఆర్‌అండ్‌బీలో విలీనం చెప్పడం తప్పిస్తే, రోడ్డును బాగు చేయడానికి నిధులు మాత్రం మంజూరు చేయడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎంతో ప్రాధాన్యత కలిగిన తాండవ రహదారికి వెంటనే నిధులు మంజూరు చేసి, శరవేగంగా నిర్మాణం చేపడితే తమ కష్టాలు గట్టెక్కుతాయని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

1,887 మంది వృద్ధులకు రేషన్ పంపిణీ

మాకవరపాలెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇంటింటికీ రేషన్ సరకులు పంపిణీ జోరుగా సాగుతోంది. ఈ నెల 26 నుంచి 30 తేదీ వరకు ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మాకవరపాలెం, రామన్నపాలెం, శెట్టిపాలెం, గిడుతూరు, తామరం, రాచపల్లి తదితర గ్రామాల్లో వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ సరకులను పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఎస్‌డీటీ ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 65 ఏళ్ల దాటిన వారు 2,918 మంది ఉన్నారన్నారు. ఇంతవరకు 1,887 మందికి ఇంటికే సరకులు అందించామని, మిగిలిన వారికి కూడా వెంటనే పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు.

అస్తవ్యస్తంగా కల్వర్టులు

సమతూకంగా లేకపోవడంతో ప్రయాణికుల ఇక్కట్లు

పట్టని ఆర్టీసీ అధికారులు.. ఆందోళనలో వాహన చోదకులు

నర్సీపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కల్వర్టులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కాలువలపై వాటిని సమతూకంగా ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదువుతున్నాయి. ప్రధానంగా రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు భీతిల్లిపోతున్నారు.

పట్టణంలోని మెయిన్ రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండ్, బైక్ పార్కింగ్‌కు వెళ్లే మార్గంలో డ్రైనేజీ మీద ఉన్న సిమ్మెంటు పలకలు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ లోపలకు, బైక్ పార్కింగ్ స్థలానికి వెళ్లడానికి ఆర్టీసీ దుకాణాల మధ్య నుంచి... దుర్గా గుడి వైపు, ఇన్‌గేట్ పక్కన రెండు దారులు ఉన్నాయి. ఈ మార్గాల వద్ద కాలువ మీద ఏర్పాటు చేసిన సిమ్మెంటు పలకలు ఎగుడు దిగుడుగా ఉండడంతో ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. దీంతో ఈ రెండు మార్గాల వినియోగం తగ్గిపోయింది. వీటిని నడక మార్గంగా ఉపయోగిస్తున్నారు. ద్విచక్ర



ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లే దారిలో అస్తవ్యస్తంగా ఉన్న సిమ్మెంటు పలకలు

వాహనంపై వచ్చేవారు ఇన్‌గేట్ నుంచి లోపలకు, పార్కింగ్ స్థలానికి వెళ్లాల్సి వస్తున్నది.

ఈ సమస్య చాలా కాలంగా ఉన్నప్పటికీ ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సిమ్మెంటు పలకల మీద నుంచి వెళ్లడం భయపడుతున్నారు. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం డిపోలు ఉన్నాయి. నర్సీపట్నం డిపో నుంచి



ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో పాడైన కల్వర్టు

ఏజెన్సీ, ఇతర ప్రాంతాలకు ప్రతీ రోజు వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రోజుకు రూ.12 లక్షలు నుంచి రూ.15 లక్షల వరకు ఆదాయం వస్తున్నది. దుకాణ సముదాయం నుంచి అద్దెల రూపం లోనూ ఆదాయం సమకూరుతున్నది. ఈ క్రమంలో బస్టాండ్ లోపలికి వెళ్లే మార్గాన్ని ఆర్టీసీ అధికారులు బాగుచేయింకపోవడం ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఎగుడు దిగుడుగా ఉన్న సిమ్మెంటు పలకల మీద నుంచి రాకపోకలు సాగిస్తూ కాలువలో పడిపోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి, వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

తాండవ జలాశయంలో పెరుగుతున్న నీటి మట్టం

నాతవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పెరుగుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాండవ గరిష్ఠ నీటి మట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 367.5 అడుగులకు చేరింది. తాండవ ఎగువ ప్రాంతాలలో వర్షాలు పడుతున్న వర్షాలకు ఇన్‌ఫ్లో ద్వారా 200 క్యూసెక్కుల నీరు వస్తున్నదని డీఈఈ అనురాధ తెలిపారు. గత ఏడాది జూన్ 29వ తేదీ నాటికి తాండవలో 359 అడుగుల నీటినిల్వలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం తాండవలో ఉన్న నీటి నిల్వలు వచ్చే ఖరీఫ్‌నకు నీరు విడుదల చేస్తే 60 రోజులకు మాత్రమే సరిపోతుందని, అయితే ఇంకా వర్షాలు పడే అవకాశం ఉండటంతో ఈ ఏడాది ఢోకా ఉండదని డీఈఈ చెప్పారు.

వచ్చే నెల 20న తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్, సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి, నీరు ఎప్పుడు విడుదల చేసేది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే సాగునీటి చెరువుల కింద రైతులు వరినారు వేస్తుండగా, ఇంకా మెట్టప్రాంతాల రైతులు వరినారు వేయలేదన్నారు. ఈలోపు తాండవ కుడి, ఎడమ కాలువల్లో రక్షణ గోడ నిర్మాణ పనులు, అక్విడెట్‌ల మరమ్మతు



తాండవలో 367.5 అడుగులకు చేరిన నీటిమట్టం

పనులు పూర్తి చేయడానికి చర్యలు చేపడతామన్నారు. కాగా తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ ఈ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని డీఈఈ తెలిపారు.

చురుగ్గా గిడుతూరు-సుంకపూర్ రోడ్డు పనులు

మాకవరపాలెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిడుతూరు-సుంకపూర్ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత ఏడాది డిసెంబరు 24వ తేదీన రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఈ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఇటు మాకవరపాలెం, ఆటు కోటవురట్ల మండలాలకు అతి దగ్గర ఈ రహదారి ఉంటుంది. పొలాల్లో నుంచి రోడ్డు వేస్తుడడంతో భూములకు మరింత ధర పలుకుతుందని, అలాగే భూముల్లో పండే పంటలను ఇంటికి సులువుగా తెచ్చుకోవచ్చనని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈ రోడ్డు 2.5 కిలోమీటర్లలో నిర్మాణానికి రూ.1.8 కోట్లు నాబార్డు ద్వారా మంజూరు చేశారు. ఈ నిధులతోసుమారు ఏడు నెలలు కాలంలోనే రోడ్డు పనులు చివరి దశకు చేరుకోవడంతో రెండు మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మట్టి పని పూర్తి చేసి మెటల్ వేశారు. రెండు నెలల్లోనే రోడ్డు



గిడుతూరు-సుంకపూర్ రోడ్డు నిర్మాణానికి వేసిన మెటల్

పనులు పూర్తవుతాయని ప్రాజెక్టు డీఈ సత్యనారాయణ తెలిపారు.

నాటు తుపాకీలు వెంటనే అప్పగించాలి

గొలుగొండ/కృష్ణాదేవిపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అనధికార నాటు తుపాకీలు ఉంటే ఐదు రోజుల్లో స్థానిక పోలీసు స్టేషన్లలో అప్పగించాలని గొలుగొండ, కృష్ణాదేవిపేట ఎస్ఐలు ఎస్.రామారావు, వై.తారకేశ్వరరావు తెలిపారు. నాటుతుపాకీలు ఉంచుకోవడం చట్టవిర్ధుమన్నారు. తుపాకీలు ఉంటే స్వచ్ఛందంగా అప్పగించాలని, లేకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు.

బాబూజగ్జీవన్ జయంతి ఘనంగా నిర్వహించాలని ర్యాలీ

గొలుగొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వచ్చే నెల 7వ తేదీన బాబూ జగ్జీవన్ జయంతిని ఘనంగా నిర్వహించాలని కోరుతూ ఆ సంఘ నాయకులు ర్యాలీ నిర్వహించారు. చీడిగుమ్మలలో ఆదివారం ఈ కార్యక్రమం చేపట్టారు. బాబూజగ్జీవన్ జయంతిని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహించాలని సంఘ నేత సోంబాబు పిలుపునిచ్చారు. ర్యాలీలో సంఘం సభ్యులు సూరిబాబు, బాలరాజు పాల్గొన్నారు.

గంజాయి నిందితుడి అరెస్టు

కృష్ణాదేవిపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఏడాదిగా పరారీలో ఉన్న గంజాయి నిందుతుడ్ని అరెస్టు చేసినట్టు ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. అల్లూరి పార్కు వద్ద గత ఏడాది జూన్ 26న కారులో 200 కిలోల పట్టుబడిందని, ఇందుకు కారకుడైన తమిళనాడు రాష్ట్రం మధురై జిల్లాకు చెందిన విఘ్నేశ్ పరారీలో ఉన్నాడని చెప్పారు. శనివారం అతన్ని అరెస్టు చేసి కోర్టు తరలించినట్టు తెలిపారు.

నిరుపయోగంగా దోబీఘాట్

మాకవరపాలెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండలఅగ్రహారం సర్పానది ఒడ్డున దోబీఘాట్ నిరుపయోగంగా మారింది. ఎనిమిదిదేళ్ల క్రితం రూ.4 లక్షలతో నిర్మించిన ఈ ఘాట్‌ను అసంపూర్తిగా వదిలేశారు. దీంతో రజకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దోబీఘాట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించండి

వైసీపీ శ్రేణులకు మాజీ మంత్రి అమర్‌నాథ్ పిలుపు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

చోడవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై పల్లెల్లో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ మంత్రి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడివాడ అమర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఇక్కడ నిర్వహించిన పార్టీ మండల నాయకుల సమావేశంలో మాట్లాడారు. జులై 31లోగా గ్రామ స్థాయిలో సంస్థాగత కమిటీల నియామకాలు పూర్తి చేయాలని, ఎక్కడైనా సమస్యలు వస్తే తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. మునుపటి జగన్ పాలనలో కార్యకర్తలకు గుర్తింపు లేదన్నది నిజమని, రానున్న రోజుల్లో కార్యకర్తలకు తగిన గుర్తింపు వస్తుందని వివరించారు. అక్రమ కేసులకు ఎవరూ భయపడకుండా ధైర్యంగా అంతా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై నిర్వహించ వలసిన కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మిలట్రీ నాయుడు, బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, శ్రీకాంత్, డీవీఆర్, పల్లా నరసింగరావు, బైన ఈశ్వరరావు, పుల్లేటి వెంకటరావు, నెహ్రూ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, దేవరపల్లి సత్య తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఊబిలో కూరుకుపోయి గేదె మృతి

రావికమతం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : చెరువు ఊబిలో కూరుకుపోయి ఊపిరాడక ఓ గేదె మృతి చెందింది. మండలంలోని దాసరయ్యపాలెం గ్రామానికి చెందిన గంట్ల ప్రసాద్‌కు చెందిన గేదెను ఆదివారం గ్రామ శివారు పొలాల్లోకి సహచరులతో కలిసి తోలుకు వెళ్లాడు. అక్కడ పొలాల్లో గ్రాసం మేసిన అనంతరం ఆ సమీపంలో ఉన్న మరుపాక కనుమల చెరువులోకి పాడి గేదె దిగి ఊబిలో కూరుకుపోయింది. ఇది గుర్తించని ప్రసాద్ గేదె కనిపించలేదని వెతక సాగాడు. అనంతరం మరుపాక కనుమల చెరువులో గేదె సగభాగం నీటిపైకి తేలి కనిపించడాన్ని చూసి గగ్గోలు పెట్టాడు. అయితే అప్పటికే అది ఊపిరాడక మృతిచెందింది.

ఘనంగా మోదకొండమ్మ ఘటాల పండుగ

పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాల్లో కోలాహలం



వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఘటాలతో ఆలయానికి వస్తున్న భక్తులు



పూజలందుకున్న అమ్మవారు

మాడుగుల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ ఆలయం ఆదివారం సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కుటుంబాలతో సహా తరలి రావడంతో ఎటుచూసినా కోలాహల వాతావరణం నెలకొంది. తొలుత అర్చకులు అమ్మవారికి విశేష అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మాడుగులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు వర్షం కురుస్తున్నప్పటికీ లెక్కచేయకుండా ఘటాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆల యంలో అమ్మవారికి ముడుపులు, మొక్కులు చెల్లించుకున్న అనంతరం సమర్పించారు. అలాగే కొబ్బరితోట వీధికి చెందిన ముసాడ కొండలరావు, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు నాగేశ్వరరావు 108 ఘటాలతో పండుగ జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాగునీటి కాలువలోకి దూసుకుపోయిన కారు

వాహనంలో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలు

జి.కొత్తపల్లి సమీప మర్లగుమ్మి వద్ద ఘటన



సాగునీటి కాలువలోకి దూసుకు వెళ్లిన కారు

చీడికాడ, జూన్29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జి.కొత్తపల్లి సమీపం మర్లగుమ్మి సాగునీటి కాలువలోకి ఆదివారం మధ్యాహ్నం పర్యాటకుల కారు దూసుకుపోయింది. విశాఖ నుంచి వస్తున్న కారులో నలుగురు పర్యాటకులు కోనాం జలాశయం అందాలను చూసేందుకు వస్తున్నారు. మలుపు వద్దకు వచ్చేసరికి సదరు వాహనం అదుపుతప్పి, కాలువలోకి దూసుకుపోయింది. కారులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక రైతులు వారిని పైకి తీసి చోడవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. పెద్ద ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

జనసేన ప్రతిష్ఠను దెబ్బతీసే వారికి చోటు లేదు

పార్టీ నుంచి షేక్ రసూల్‌ను తొలగించాం : జిల్లా ప్రధాన కార్యదర్శి

చోడవరం, జూన్29 (ఆంధ్రజ్యోతి) : జనసేన ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా ప్రవర్తించే వ్యక్తులకు పార్టీలో చోటు లేదని, అటువంటి చర్యలకు పాల్పడే వ్యక్తులను ఎప్పటికీ సహించదని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్ పట్ల అనుచితంగా ప్రవర్తించిన బుచ్చెయ్యపేట జనసేన కార్యకర్త షేక్ రసూల్‌ను పార్టీ నుంచి తొలగించామని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని పార్టీ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించిందని చెప్పారు. పార్టీ నుంచి బహిష్కరించిన వారితో జనసేన నాయకులు, కార్యకర్తలు ఎలాంటి రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనరాదని తెలిపారు.

'కేజీబీవీ ప్రిన్సిపాల్‌కు మెరుగైన వైద్యం అందించాలి'

చోడవరం : కూటమి నేతల వేధింపులతో ఆసుపత్రి పాలైన వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్‌కు మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కస్తూర్బా సీటు విషయంలో కూటమి నాయకులు మహిళా అధికారులను, ప్రిన్సిపాల్‌ను బెదిరించి వేధింపులకు పాల్పడడం ఆందోళన కలిగించే అంశమని తెలిపారు. అలాగే బుచ్చెయ్యపేట మండలంలో ఇటీవల గుండె పోటుతో మహిళా ఎండీవో మృతిచెందడానికి కారణం ఆ మండలానికి చెందిన డెయిరీ డైరెక్టర్ కారణమని ఆరోపించారు. ఎండీవో మృతిపైనా సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సబ్బవరం, జూన్ 29 (ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. అనకా పల్లి- ఆనందపురం జాతీయ రహదారి చిన్నియ్యపాలెం పెట్రోల్ బంకు వద్ద ఆదివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన దుంగల శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు విశాఖపట్నం జిల్లా తగరపువలస వద్ద గల ఓ ప్రైవేటు రెసిడెన్షియల్ కళా శాలలో ఇంటర్ చదువుతున్న తమ కుమారుడిని చూసేందుకు బైక్‌పై బయ లుదేరారు. సబ్బవరం దరి చిన్నయ్యపాలెం వద్దకు వచ్చేసరికి మిరియాల గూడ నుంచి ఒడిశా వెళుతున్న లారీ వెనుక నుంచి వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో విజయలక్ష్మి రోడ్డుపై పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త శ్రీనివాసరావుకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



మాడుగుల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా మాడుగుల నూకాలమ్మ కాలనీ గల ఇంద్రజ్యామ్న హాలులో కొలువుదీరిన స్వామివారు ఆదివారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత వేకువజామున అర్చకులు విశేష అలంకరణలు, పూజలు నిర్వహించిన అనంతరం దర్శనభాగ్యం కల్పించారు.

రోజంతా ముసురు

మాడుగుల రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం ముసురు వాతావరణం నెలకొంది. తెల్లవారుజాము మూడు గంటల నుంచి తేలికపాటి జల్లులతో ఆరంభమై రోజంతా చిరుజల్లులు కురస్తూనే ఉన్నాయి.